సాక్షి వనపర్తి

బుధవారం : 17 : జనవరి : 2024



నేటి నుంచి రంగాపూర్ ఉర్సు..

మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే రంగాపూర్ ఉర్సు బుధవారం ప్రారంభం కానుంది.

వివరాలు 8లో ▸



రైతుల సంతోషం కోసమే..

రైతుల ఉత్సాహానికే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నామని మంత్రి జూపల్లి అన్నారు.

వివరాలు 8లో ▸

వాతావరణం

గరిష్టం/కనిష్టం 35.0 /17.1

రోజంతా ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. ఉదయం, రాత్రి వేళ చలి తీవ్రత కాస్త పెరుగుతుంది.

రన్నరప్‌తో సరి..



పాలమూరులోని మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో జరిగిన 2వ ఫాస్ట్-5 సీనియర్ నేషనల్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో పురుషుల విభాగంలో తెలంగాణ జట్టు రన్నరప్‌తో సరిపెట్టుకుంది. మహిళల జట్టు మూడో స్థానంలో నిలిచింది. టోర్నీలో 28 రాష్ట్రాల నుంచి 850 మందికిపైగా క్రీడాకారులు పాల్గొన్నారు. - మహబూబ్‌నగర్ క్రీడలు

- వివరాలు 8లో..

కల్యాణం.. కమనీయం..



సింగోటం లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి ఆలయ ఆవరణలో స్వామివారి కల్యాణం కమనీయంగా నిర్వహించారు. అంతకుముందు స్వామివారి ఉత్సవ విగ్రహాలను పుష్కరిణిలో స్నానాలు చేయించారు. కార్యక్రమంలో ఆలయ ఫౌండర్, చైర్మన్ ఆదిత్య లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు. - కొల్లాపూర్ రూరల్

సంక్రాంతి కనువిందు..



ఖిల్లాఘనపురంలో వాహనాల ప్రదర్శన

వనపర్తి టౌన్/ ఖిల్లాఘనపురం: పట్టణాలు, పల్లెల్లో సోమవారం సంక్రాంతి సంబరాలు అంబరాన్నంటాయి. బతుకుదెరువుకు వివిధ పట్టణాలకు వలస వెళ్లిన వారంతా పండుగ సందర్భంగా పెద్దసంఖ్యలో పల్లెలకు తరలిరావడం.. ఆడపడుచులు పుట్టింటికి రాకతో పల్లెలకు పండుగ శోభ వచ్చింది. పండుగను పురస్కరించుకుని సోమవారం తెల్లవారుజామునే ఆడపడుచులు ఇళ్ల ముంగిళ్లలో రంగురంగుల రంగవల్లులు వేసి ఆవు పేడతో తయారు చేసిన గొబ్బెమ్మలను ఉంచి రేగిపండ్లు, నవధాన్యాలతో అలంకరించారు. పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు ఏర్పాటుచేసి బహుమతులు అందజేయగా సాయంత్రం ఎద్దుల బండ్ల ఊరేగింపు నిర్వహించారు. జిల్లాకేంద్రంలోని వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి పల్లకీసేవ వైభవంగా జరిగింది. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. మహిళలకు గాజులు అందజేశారు. ఖిల్లాఘనపురం గట్టు ఆంజనేయస్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు.



వనపర్తి వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో ఉత్సవ విగ్రహాలకు పూజలు చేస్తున్న అర్చకులు

న్యూస్‌రీల్

వాయుసేనలో ఉద్యోగాలకు దరఖాస్తులు

పెబ్బేరు రూరల్: అగ్నివీర్ వాయుకింద నాలుగేళ్ల సర్వీసు అనంతరం 25 శాతం శాశ్వత ఉద్యోగం ప్రాతిపదికన ఉద్యోగ భర్తీకి నోటిఫికేషన్ విడుదలైందని వింగ్ కమాండర్ గురుప్రీత్ అత్వాల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు జనవరి 17 నుంచి ఫిబ్రవరి 6 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని.. ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టుతో ఇంటర్మీడియట్ లేదా తత్సమాన పరీక్షలో ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు httpr://agnipathvayu.cdac.in వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు.

నేటి నుంచి సదరం స్లాట్ బుకింగ్స్

వనపర్తిటౌన్: అర్హులైన దివ్యాంగులు సదరం సర్టిఫికెట్లకు బుధవారం సాయంత్రం 4 నుంచి మీ-సేవా కేంద్రాల్లో స్లాట్ బుకింగ్ చేసుకోవాలని జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డా. నరేందర్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్‌కార్డు జిరాక్స్, మీ-సేవా రసీదు, పాత సదరం ధ్రువపత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఎక్స్-రే, మెడికల్ రిపోర్ట్‌తో కేటాయించిన తేదీల్లో జిల్లా జనరల్ ఆస్పత్రికి వచ్చి సంబంధిత వైద్యులతో వికలత్వ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని పేర్కొన్నారు. కేవలం శారీరక దివ్యాంగులకు మాత్రమేనని.. మాస్క్ ధరించి హాజరుకావాలని కోరారు.

నేడు వాహనాల వేలం

కొత్తకోట రూరల్: జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆదేశానుసారం కొత్తకోట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో పట్టుబడిన వాహనాల వేలం బుధవారం నిర్వహించనున్నట్లు ఎక్సైజ్ సీఐ ఓంకార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తకోట ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో వేలం ఉంటుందని.. పాల్గొనే వారు రూ.5 వేలు డిపాజిట్ చెల్లించాలని, వేలం ప్రక్రియ మధ్యాహ్నం ఒంటిగంటకు జిల్లా సూపరింటెండెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తామని పేర్కొన్నారు.

కాకతీయుల శాసనాన్ని కాపాడుకోవాలి



కొల్లాపూర్: పెద్దకొత్తపల్లి మండలం కల్వకోల్‌లో ఉన్న కాకతీయుల కాలం నాటి శాసనాన్ని కాపాడుకోవాలని పురావస్తు పరిశోధకుడు, ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి అన్నారు. మంగళవారం ఆయన కల్వకోల్‌లోని నందికోటేశ్వరస్వామి ఆలయం పక్కన ఏర్పాటు చేసిన ప్రతాపరుద్రుని శిలాశాసనాన్ని పరిశీలించారు. కాకతీయ గణపతిదేవుని కాలంలో ఈ శాసనం ప్రతిష్ఠించడం జరిగిందన్నారు. కాకతీయుల వంశవృక్షం, ప్రోలరాజు విజయాలు శాసనంలో ఉన్నాయన్నారు. గణపతిదేవుని సామంతుడైన చెరకు బొల్లయ్యరెడ్డి జమ్ములూరుపురం కలవకొలను ఏరువ సీమకు అధిపతి అనే వివరాలు కూడా ఉన్నాయన్నారు. కల్వకోల్ గ్రామాన్ని పూర్వం కలవకొలను అని పిలిచేవారు.

గడ్డుకాలం

నిధుల లేమితో కొట్టుమిట్టాడుతున్న వనపర్తి మున్సిపాలిటీ



వనపర్తి మున్సిపాలిటీ

- ఆస్తిపన్ను వసూళ్లతో కార్మికులకు వేతనాలు
- శతశాతం వసూలుకు 75 రోజుల గడువు
- ట్రేడ్ లైసెన్స్‌లు, కొళాయి బిల్లుల వసూళ్లపై శ్రద్ధ చూపని అధికారులు
- పదేళ్లకు పైబడిన మొండి బకాయిదారులు 1,800కు పైగా..

వనపర్తిటౌన్: వనపర్తి పురపాలికలో రోజు రూ.2 లక్షల నుంచి రూ.3 లక్షలకుపైగా వసూలు కావాల్సిన ఆస్తి పన్ను.. ప్రస్తుతం రూ.10 వేల నుంచి రూ.15 వేలు దాటని పరిస్థితి నెలకొంది. సాధారణ నిధుల (జనరల్ ఫండ్) ఖజానా పూర్తిగా ఖాళీ కావడంతో కార్మికులకు వేతనాలు చెల్లించేందుకు అధికారులు నానా అవస్థలు పడుతున్నారు. మార్చి 31 వరకు పన్ను వసూళ్ల లక్ష్యం చేరుకోకుంటే మనుగడే ప్రశ్నార్థకంగా మారనుంది. ఇక నుంచి ఇల్లిల్లూ తిరిగి పన్ను వసూళ్లకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అధికార యంత్రాంగం నిర్ణయించింది. ఆస్తి, కొళాయి, పుర దుకాణాల అద్దెలు వసూలు చేస్తే సాధారణ నిధిలో జమై మౌలిక వసతుల కల్పనకు అవకాశం ఉంటుంది.. కానీ ఎక్కడ కూడా ఈ ప్రకియ సజావుగా సాగడం లేదు. గతేడాది అక్టోబర్‌లో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ రావడం.. జనవరి వరకు అధికారులు అదే పనిలో ఉండటంతో ఆస్తి పన్ను ఆశించిన మేర వసూలు కాలేదు. ప్రతి ఏడాది ఫిబ్రవరి మొదటి వారం నుంచే పన్ను వసూళ్లపై దృష్టి సారించినప్పటికీ అనుకున్న లక్ష్యం చేరడం లేదు. ఇప్పటి నుంచే పన్ను వసూళ్లలో వేగం పెంచితేనే ప్రస్తుత గడ్డు పరిస్థితుల్లో కార్మికులకు వేతనాలు చెల్లించేందుకు, కార్యాలయ నిర్వహణకు అవకాశం ఉండటంతో అధికారులు అందుకు అనుగుణంగా వడివడిగా అడుగులు వేస్తున్నారు. పన్ను వసూళ్లు తగ్గుతుండటంతో పురపాలికలో మౌలిక వసతుల కల్పనకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రతి ఆర్నెల్లకు ఓసారి నోటీసులు జారీ చేసి పన్ను వసూళ్లు చేయడంలో అధికారులు విఫలమయ్యారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి ఏడాది ఫిబ్రవరి, మార్చిలోనే పన్ను వసూళ్ల వేగం పెంచుతున్నా.. బకాయిలు మాత్రం పేరుకుపోతున్నాయి. గృహ, వ్యాపార, ప్రైవేట్, ప్రభుత్వ ఆస్తి పన్నులు భారీగా బకాయి ఉండటం, వసూళ్లకు ముందు నుంచి అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆదాయం చాలావరకు తగ్గిపోతోంది.

వనపర్తి పురపాలికలో ఇలా..	
అన్నిరకాల నివాసాలు 17 వేలు	
మొత్తం బ్లాక్‌లు 49	వార్డులు 33



పన్నులు వసూలు చేస్తున్న అధికారులు (ఫైల్)

వసూళ్లకు ప్రణాళికలు..



ఆస్తిపన్ను శతశాతం వసూలుకు తగిన ప్రణాళికలు రూపొందిస్తున్నాం. ప్రత్యేక బృందాలు ఏర్పాటుచేసి బ్లాక్‌ల వారీగా లక్ష్యాలను నిర్దేశిస్తాం. మొండి బకాయిల వసూలుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం. వసూలు చేసిన డబ్బులు కార్మికుల వేతనాలు చెల్లించేందుకే అధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. జనరల్ ఫండ్ కొరత వాస్తవం.

- విక్రమసింహారెడ్డి, మున్సిపల్ కమిషనర్, వనపర్తి

కార్మికుల వేతనాలకే అధికంగా..

పుర ఆదాయాన్ని చాలావరకు కార్మికుల వేతనాలు, విద్యుత్ బిల్లులు, పీఎఫ్ చెల్లింపులు, ఇతర అత్యవసర పనులకు కేటాయిస్తారు. వనపర్తి మున్సిపాలిటీలో పారిశుద్ధ్య కార్మికుల వేతనాలకు నెలకు రూ.32 లక్షలు, పీఎఫ్, ఈఎస్‌ఐ చెల్లింపులకు రూ.8 లక్షలు, ఎన్‌ఎంఆర్ వేతనాలకు రూ.6 లక్షలు, విద్యుత్ బిల్లులకు రూ.7 లక్షలు, అత్యవసర పనులు తదితర వాటికి కలిపి నెలకు మొత్తం సుమారుగా రూ.50 లక్షల నుంచి రూ.60 లక్షల వరకు ఖర్చు అవుతుంటుంది. ఈ లెక్కన ఏడాదికి రూ.6 కోట్ల నుంచి రూ.7 కోట్ల వరకు ఖర్చవుతుండటంతో అధికారులకు నిర్వహణ భారంగా మారింది. ఆస్తిపన్ను వసూలు లక్ష్యం 75 రోజుల్లో ఛేదిస్తే కొంత మెరుగుపడే అవకాశం ఉంటుంది.

మొండి బకాయిలు..

పురపాలికలో 1,800 మందికిపైగా యజమానులు పదేళ్లకుపైగా ఆస్తి పన్ను చెల్లించడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని పుర అధికారులు లెక్కతేల్చారు. మొండి బకాయిలు రూ.3 వేల నుంచి రూ.10 లక్షల వరకు ఉండటం గమనార్హం. మొండి బకాయిలు రూ.కోటికి పైగా ఉన్నాయి. వీటి వసూళ్లకు ఉపక్రమిస్తే రాజకీయ పార్టీల నాయకులు, కొందరు కౌన్సిలర్లు అడ్డు తగులుతున్నారు.

100 శాతం మొక్కలు ఉండాలి

- జెడ్పీ సీఈఓ రామమహేశ్వర్‌రెడ్డి

ఖిల్లాఘనపురం: గ్రామపంచాయతీల్లో ఏర్పాటు చేసిన నర్సరీల్లో 100 శాతం మొక్కలు ఉండేలా చర్యలు తీసుకోవాలని జెడ్పీ సీఈఓ రామమహేశ్వర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలో పర్యటించిన ఆయన అంగన్‌వాడీ కేంద్రాలు, నర్సరీ, ఎంపీడీఓ కార్యాలయం తదితర వాటిని తనిఖీ చేశారు. నర్సరీల్లో ఖాళీ బ్యాగులు లేకుండా చూడాలని.. మొలకెత్తని వాటిని గుర్తించి వెంటనే విత్తనాలు నాటాలని సూచించారు. మొక్కలను ఎప్పటికప్పుడు పరిశీలించి ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల సంఖ్య తగ్గకుండా చూడాలని, చిన్నారులకు పౌష్టికాహారం అందించాలని ఉపాధ్యాయురాలికి సూచించారు. బాలింతలు, గర్భిణులు, కిశోర బాలికలకు ఆహారం, గుడ్లు ఇవ్వాలని, రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.



ఖిల్లాఘనపురంలో నర్సరీని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ రామమహేశ్వర్‌రెడ్డి

కృష్ణా బ్రిడ్జిపై రాకపోకలు బంద్

- నేటి నుంచి టైరోడ్డు వరకే రాయచూర్ బస్సులు

కృష్ణా: రాష్ట్ర సరిహద్దులోని కృష్ణా బ్రిడ్జిపై వాహనాల రాకపోకలను బుధవారం తెల్లవారుజామున 5 గంటల నుంచి నిలిపివేయనున్నట్లు ఎస్పీ యోగేష్ గౌతమ్, కృష్ణా ఎస్‌ఐ విజయభాస్కర్ మంగళవారం ప్రకటనలో తెలియజేశారు. బ్రిడ్జి మరమ్మతుల నిమిత్తం దాదాపు 45 రోజుల పాటు వాహనాల రాకపోకలను నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి రాయచూర్‌కు వెళ్లే బస్సులను టైరోడ్డు వరకు మాత్రమే అనుమతించనున్నట్లు తెలిపారు. రాయచూర్‌కు వెళ్లే వారు గద్వాల మీదుగా వెళ్లాలని సూచించారు. అదేవిధంగా మక్తల్ పరిసర ప్రాంతాల ప్రజలు జూరాల డ్యాం మీదుగా లేదా కర్ణాటకలోని సైదాపూర్, గూడూర్ బ్రిడ్జి మీదుగా వెళ్లేందుకు అవకాశం ఉందని తెలిపారు. కాగా ద్విచక్ర వాహనాలు వెళ్లేందుకు అవకాశం ఉన్నప్పటికీ అధికారులు అనుమంతించడం లేదు. ప్రస్తుతం కృష్ణానదిలో కొత్తగా నిర్మిస్తున్న బ్రిడ్జి పక్కన తాత్కాలిక మట్టిరోడ్డు ఉంది. ఆ రోడ్డుపై ద్విచక్ర వాహనాల రాకపోకలకు అనుమతించాలని స్థానికులు కోరుతున్నారు.



కృష్ణానదిలో నిర్మిస్తున్న బ్రిడ్జి పక్కనున్న మట్టిరోడ్డు

పకడ్బందీగా ఓటరు జాబితా

- కలెక్టర్ తేజస్ పవార్

వనపర్తి: తప్పులు లేని ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించాలని కలెక్టర్ తేజస్ పవార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ నుంచి అదనపు కలెక్టర్లు, ఆర్డీఓ, తహసీల్దార్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన పాల్గొని పలు సూచనలు చేశారు. 2024, జనవరి 1 నాటికి 18 ఏళ్ల నిండిన యువత నుంచి వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి ఓటరు జాబితా సిద్ధం చేయాలన్నారు. లాగిన్‌లో ఉన్న వాటిని వెంటనే పరిశీలించాలని, బీఎల్వో స్థాయిలో ఉన్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆమోదం తెలిపేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఓటరు నమోదు ప్రక్రియ త్వరగా పూర్తి కానందున కొందరు ఓటర్లు పలుమార్లు దరఖాస్తు చేసుకుంటారని, ఒకటి కంటే ఎక్కువ వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. డబుల్ ఎంట్రీలకు అవకాశం ఇవ్వొద్దని, బీఎల్వోలు, సూపర్‌వైజర్లను అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. విధులను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. చనిపోయిన, ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి పేర్లను పక్కా ఆధారాలతో జాబితా నుంచి తొలగించాలన్నారు. ఒక పోలింగ్ స్టేషన్‌లో ఉండాల్సిన పేరు మరో పోలింగ్ స్టేషన్లో ఉన్న వాటిని గుర్తించి దరఖాస్తు తీసుకొని సరిచేయాలని చెప్పారు. ఈ నెల 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం నిర్వహించాలని.. ముందస్తుగా గ్రామాల్లో టాం టాం వేయించాలని తెలిపారు. జాబితాలో ఉన్న దివ్యాంగులు, 80 ఏళ్లు పైబడి వారి పేర్లను మార్కింగ్ చేయాలన్నారు. ఈ నెల 25న జాతీయ ఓటరు దినోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ పవార్

'కార్మిక చట్టాలను కాలరాస్తున్న కేంద్రం'



అమరచింత: కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలను తుంగలో తొక్కేందుకు కంకణం కట్టుకుందని ఏఐటీయూసీ రాష్ట్ర నాయకుడు సురేష్ ఆరోపించారు. మంగళవారం పట్టణంలో ఏఐటీయూసీ క్యాలెండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్మికవర్గం ఎన్నో త్యాగాలు చేసి సాధించుకున్న చట్టాలను కేంద్రంలోని మోదీ ప్రభుత్వం సవరణల పేరుతో లేబర్‌కోడ్ అమలు చేస్తోందని.. దీని ఫలితంగా కార్మికుల జీవితాలు విధ్వంసమవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికుల పొట్టగొట్టి పెట్టుబడిదారుల జేబులు నింపేందుకు కొత్త చట్టాలు అమలు చేస్తోందని మండిపడ్డారు. అసంఘటిత కార్మికులందరూ ఐక్యంగా ఉండి ఉద్యమాలు చేసి హక్కులను సాధించుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీడీ కార్మిక సంఘం నాయకుడు శ్యాంసుందర్, మిషన్ భగీరథ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రఘు, కతలప్ప, రవీందర్, భాస్కర్, ఎర్రన్న, ఇబ్రాయిల్, సోలు తదితరులు పాల్గొన్నారు.

ఫుల్లుగా తాగేశారు!

- సంక్రాంతి సందర్భంగా ఉమ్మడి జిల్లాలో భారీగా మద్యం అమ్మకాలు
- మూడు రోజుల్లో రూ.51.86 కోట్ల వ్యాపారం
- సర్కార్ ఖజానాకు భారీగా ఆదాయం



మహబూబ్‌నగర్ క్రైం: ఉమ్మడి జిల్లాలో ఏ శుభకార్యమైనా.. పండగైనా..మద్యం ఏరులై పారాల్సిందే. సంక్రాంతి సందర్భంగా వరుసగా నాలుగు రోజులు సెలవులు రావడంతో మందుబాబులు పండగ చేసుకున్నారు. ఆదివారం నుంచి మంగళవారం అర్ధరాత్రి వరకు జిల్లాలో ఉన్న దుకాణాల కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. మద్యం అమ్మకాలతో ప్రభుత్వానికి భారీ ఆదాయమే లభించింది. ఇటీవల నూతన సంవత్సర వేడుకల సందర్భంగా జిల్లావ్యాప్తంగా రూ.40 కోట్ల వ్యాపారం జరిగితే.. ప్రస్తుతం సంక్రాంతి సందర్భంగా మూడు రోజుల్లో రూ.50 కోట్లకు పైగా వ్యాపారం జరిగింది. పండగకు నాలుగు రోజుల ముందే మద్యం వ్యాపారులు తిమ్మాజిపేట, కొత్తకోట దగ్గర ఉన్న డిపోల నుంచి పెద్ద ఎత్తున మద్యం కొనుగోలు చేశారు.

- ఉమ్మడి జిల్లాలో ఉన్న రెండు లిక్కర్ డిపోల నుంచి ఈనెల 12 నుంచి (14, 15సెలవు) మంగళవారం వరకు మూడు రోజుల్లో రూ.51.86 కోట్లు విలువ చేసే మద్యం స్టాక్‌ను దుకాణాలకు తరలించారు. ఇందులో ఐఎంఎల్ కాటన్లు 55,660 ఉండగా, బీర్లు 72,669 కాటన్లు ఉన్నాయి. వీటితో పాటు అప్పటికే మద్యం దుకాణాల్లో కొంత స్టాక్ ఉండగా.. దాని విలువ దాదాపు రూ.10 కోట్ల వరకు ఉంటుంది. ఈ సంక్రాంతికి దాదాపు రూ.60 కోట్ల మద్యం విక్రయాలు జరిగాయి.

మహబూబ్‌నగర్, జడ్చర్లలో అధికం..

ఉమ్మడి జిల్లాలో మద్యం అమ్మకాల్లో మహబూబ్‌నగర్ జిల్లా అగ్రస్థానంలో ఉంది. ఇందులో జడ్చర్ల మొదటి స్థానంలో ఉండగా.. మహబూబ్‌నగర్ రెండో స్థానంలో ఉంది. ఆ తర్వాత గద్వాల, కొత్తకోట ప్రాంతాల్లో మద్యం విక్రయాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో మహబూబ్‌నగర్, నారాయణపేటలో 90, నాగర్‌కర్నూల్ జిల్లాలో 67, వనపర్తిలో 37, గద్వాలలో 36 మద్యం దుకాణాలలో మద్యం భారీగా అమ్మకాలు జరిగాయి.

విక్రయించిన స్టాక్ వివరాలు

తేదీ	ఐఎంఎల్	బీరు కాటన్లు	విలువ (రూ.కోట్లలో..)
తిమ్మాజిపేట లిక్కర్ డిపో పరిధిలో..			
12.01.24	8,041	10,825	7.79
13.01.24	12,120	15100	11.04
16.01.24	14,200	22,600	13.60
కొత్తకోట లిక్కర్ డిపో పరిధిలో..			
12.01.24	4,827	5,118	4.32
13.01.24	8,871	7,479	7.73
16.01.24	7,601	11,547	7.38

ఆదివాసీ చెంచుల అభ్యున్నతికి కృషి

మన్ననూర్: జిల్లాలోని ఆదివాసీ చెంచుల అభ్యున్నతికి పాటుపడతామని నాగర్‌కర్నూల్ కలెక్టర్ ఉదయ్‌కుమార్ అన్నారు. సోమవారం మన్ననూర్‌లోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో (పీటీజీ) ప్రధాని నరేంద్రమోదీ చెంచులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. లోతట్టు గ్రామాలు, పెంటల్లో అర్హులైన చెంచులకు పక్కా ఇళ్లు, కొళాయి, విద్యుత్, రోడ్లు, నాణ్యమైన విద్య, హాస్టల్ సౌకర్యాలు, నైపుణ్య వికాసం, అందరికీ ఆరోగ్యం, పౌష్టికాహారం, వంటగ్యాస్ కనెక్షన్లు, అంగన్‌వాడీ కేంద్రాలు తదితరవి అందిస్తామన్నారు. గతంలో ఎన్‌రోల్ చేసుకున్న ఆధార్, ఆయుష్మాన్ భారత్, కిసాన్ లబ్ధిదారులందరికీ మంజూరు పత్రాలు అందజేశామన్నారు. ఆదివాసీ చెంచుల అభ్యున్నతికి ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతాయని చెప్పారు. అర్హులై ఉండి లబ్ధిపొందని వారు మన్ననూర్‌లోని ఐటీడీఏలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే చేతులమీదుగా పథకాలను ఆవిష్కరించడంతోపాటు మారుమూల ప్రాంత చెంచుల కోసం మెడికల్ మొబైల్ వాహనం ప్రారంభించారు. అలాగే జీసీసీ ఉత్పత్తులు, ఆరోగ్యలక్ష్మి, ప్రథమ చికిత్స విభాగం, మొబైల్ మెడికల్ యూనిట్, ఆధార్ నమోదు కేంద్రం స్టాళ్లను పరిశీలించారు.

భాష తెలియక తికమక..

జిల్లాలోని చెంచులతో ప్రధాని మోదీ వర్చువల్‌గా మాట్లాడుతారని ఆశించినా.. చివరి నిమిషంలో మహారాష్ట్ర, జార్ఖండ్, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్, ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా వర్చువల్ సమావేశాల వీడియో క్లిప్పింగ్‌లు స్క్రీన్లపై ప్రదర్శించడంతో విస్తుపోయారు. ఒక్క జిల్లా మినహాయిస్తే ఆయా రాష్ట్రాల వర్చువల్ మీట్ ప్రసంగాలు హిందీలో ఉండటంతో అర్థం కాక తికమకపడ్డారు.



ఎల్‌ఈడీ స్క్రీన్‌లో వర్చువల్ సమావేశం తిలకిస్తున్న చెంచులు

క్లుప్తంగా

ఇసుక చోరీకి యత్నం



జడ్చర్ల టౌన్: పుర పరిధిలోని లక్ష్మీనగర్‌కాలనీలో ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఇసుక చోరీకి యత్నించారు. కాలనీవాసుల కథనం మేరకు.. కాలనీలో సీసీ రహదారి నిర్మాణానికి కాంట్రాక్టర్ రహీం ఇసుక నిల్వ చేశాడు. రహదారి పనులు అర్ధాంతరంగా నిలిచిపోవడంతో ఇసుక అలాగే ఉండిపోయింది. ఆదివారం అర్ధరాత్రి దాటాక పొక్లెయిన్ సాయంతో టిప్పర్లు, ట్రాలీ వాహనంలో ఇసుక తరలించేందుకు 20 మంది చేరుకున్నారు. గుర్తించిన కొందరు వెంటనే కాంట్రాక్టర్, సూపర్‌వైజర్ పరశురాంకు సమాచారం ఇచ్చారు. వారు డయల్ 100కు ఫిర్యాదు చేశారు. పోలీసులు అక్కడికి చేరుకునేలోపు పరారయ్యారు. సూపర్‌వైజర్ ఫిర్యాదు మేరకు సోమవారం సీఐ రమేష్‌బాబు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మైలారం జాతరకు వెళ్లి..

- చెరువులో పడి యువకుడి మృతి



నరేష్ (ఫైల్)

నర్వ: జాతరకు వెళ్లిన చోట చెరువులో పడి ఓ యువకుడు మృతిచెందిన ఘటన పెద్దకడ్మూర్‌లో విషాదం నింపింది. బాధితుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన నరేష్(19) తల్లిదండ్రులతో కలిసి కర్ణాటకలోని వారి ఇంటిదేవుడైన మైలారం మల్లయ్య జాతరకు ఈనెల 13న వెళ్లాడు. ఈ క్రమంలోనే అక్కడ కొందరు యువకులతో కలిసి చెరువులో స్నానం చేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. ఘటన సమయంలో చెరువులో అప్పటికే రెండుసార్లు మునిగిన అతడు మరోసారి మునిగి తేలలేదు. దీంతో అతడితో పాటు చెరువుకు వెళ్లినవారు వెంటనే అతడి తల్లిదండ్రులకు సమాచారం అందజేశారు. దీంతో అక్కడ కర్ణాటక పోలీసుల సాయంతో రెండు రోజులపాటు గాలింపు చర్యలు చేపట్టారు. కాగా మూడోరోజు మృతదేహం బయటకు తేలడంతో సొంత గ్రామానికి తీసుకువచ్చారు.

పాఠశాలలో వ్యక్తి ఆత్మహత్య



మక్తల్: మక్తల్ పట్టణంలో సోమవారం ప్రభుత్వ పాఠశాల వద్ద కృష్ణ మండలం మురార్‌దొడ్డికి చెందిన రాము(32) కిటికీకి ప్లాస్టిక్ వైర్‌తో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. మురార్‌దొడ్డికి చెందిన రాము రాయిచూర్ జిల్లా శక్తినగర్ మండలంలోని కొర్తికొండ తిమ్మప్పదేవాలయం వద్ద టెంకాయలు విక్రయిస్తూ జీవనం సాగించేవాడు. ఇతని మొదటి భార్య లక్ష్మి, కుమారుడు, కుమార్తె శక్తినగర్ మండలం కొరిపేటలో ఉంటున్నారు. మాగనూర్ మండలం కొల్పూర్‌కు చెందిన నవిత అనారోగ్యానికి గురైంది. దీంతో ఆమె తిమ్మప్ప దేవాలయానికి వెళ్తూ ఉండేది. ఆ సమయంలో టెంకాయలు విక్రయించే రాముతో పరిచయం ఏర్పడింది. రాము ఆరు నెలల కిందట నవితను రెండో పెళ్లి చేసుకుని, నవిత తల్లిగారి ఇంటి వద్దనే ఉంటున్నాడు. ఈ సమయంలో తాగడానికి రెండో భార్య నవితను డబ్బులు అడిగాడు. ఆమె డబ్బులు ఇవ్వకపోవడంతో మనస్తాపానికి గురై మా గ్రామానికి వెళ్తున్నానని చెప్పి ఇంట్లో నుంచి బయలుదేరాడు. మక్తల్ ఉన్నత పాఠశాలకు చేరుకుని కిటికీకి ప్లాస్టిక్ వైర్‌తో ఉరి వేసుకున్నాడు. పాఠశాల అటెండర్ ఎండీ కరీం గదులను శుభ్రం చేసేందుకు వెళ్లి కిటికీకి ఉన్న రామును చూసి పాఠశాల హెచ్ఎంకు సమాచారం ఇచ్చాడు. పోలీసులు మృతదేహాన్ని మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పర్వతాలు తెలియజేశారు.

పురుగుమందు తాగిన యువకుడు..



నల్లారెడ్డి(ఫైల్)

మల్దకల్: ఆర్థిక ఇబ్బందులతో ఓ యువకుడు పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని పాల్వాయిలో చోటుచేసుకుంది. ఎస్ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాల్వాయికి చెందిన చక్రుడు, శంకరమ్మ రెండో కుమారుడు నల్లారెడ్డి(30) వ్యవసాయ పనులు చేసుకుంటూ కుటుంబానికి చేదోడువాదోడుగా ఉండేవాడు. ఆర్థిక పరిస్థితులు బాగోలేక పలుమార్లు తీవ్ర మనస్తాపానికి గురయ్యేవాడు. ఈ నెల 10న పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూల్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు ఎస్ఐ తెలియజేశారు.

కనుల పండువగా..



కల్యాణోత్సవం జరిపిస్తున్న వేద పండితులు.. పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు

- భోగమహేశ్వరంలో పార్వతి, పరమేశ్వరుల కల్యాణోత్సవం
- పట్టువస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే దంపతులు
- గ్రామాల నుంచి తరలివచ్చిన ప్రభలు

అచ్చంపేట: శ్రీశైలం ఉత్తర ద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రం దిగువకొండ భోగ మహేశ్వరంలో మంగళవారం తెల్లవారుజామున 4 గంటలకు పార్వతి, పరమేశ్వరుల కల్యాణోత్సవం కనుల పండువగా జరిగింది. ఉమామహేశ్వరంలో ప్రతిఏటా మకర సంక్రాంతి నుంచి వారం రోజులపాటు బ్రహ్మోత్సవాలు జరుగుతాయి. ఆలయ ఈఓ శ్రీనివాసరావు, కమిటీ చైర్మన్ కందూరు సుధాకర్ స్వామివారికి అలంకరణ వస్త్రాలు సమర్పించారు. మంగళవారం రాత్రి ఉమామహేశ్వర క్షేత్రం నుంచి స్వామివారిని పల్లకీలో దిగువ కొండ బోగమహేశ్వరం తీసుకొచ్చారు. అచ్చంపేట భ్రమరాంబ ఆలయంతోపాటు వివిధ గ్రామాల నుంచి బయలుదేరిన ప్రభలు మంగళవారం తెల్లవారుజామున భోగ మహేశ్వరం చేరుకున్నాయి. అనంతరం ఉమామహేశ్వర క్షేత్రం నుంచి పార్వతి, పరమేశ్వరులను కిందకొండకు తీసుకురావడంతో కల్యాణోత్సవం ప్రారంభమైంది.

పట్టువస్త్రాల సమర్పణ

అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు పట్టువస్త్రాలను అందజేశారు. అనంతరం వేదపండితులు వీరయ్యశాస్త్రి, నీలకంఠశాస్త్రిలు శాస్త్రోక్తులతో కల్యాణం జరిపించారు. నియోజకవర్గంలోని బల్మూర్, లింగాల, అమ్రాబాద్, ఉప్పునుంతల, అచ్చంపేట, వంగూరు, పదర, చారకొండ మండలాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. అనంతరం భక్తులు ఉమామహేశ్వరం క్షేత్రంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో రంగాపూర్ సర్పంచ్ లోక్యానాయక్, ఎంపీపీ శాంతాబాయి, కౌన్సిలర్ గౌరీశంకర్, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పార్వతీదేవిని భోగమహేశ్వరంలోని కల్యాణ వేదిక వద్దకు తీసుకెళ్తున్న భక్తులు

నేటి కార్యక్రమాలు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం 9 గంటలకు ప్రాతరౌపాసన, బలిహరణం, నీరాజనం, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం 4 గంటలకు సాయమౌపాసం, సభాపూజ, బలిహరణం, నీరాజనం, అశ్వవాహన సేవ, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వితరణ ఉంటుందని నిర్వాహకులు చెప్పారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు..

ఉమామహేశ్వరుడి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం ప్రాంతఃకాల పూజలు నిర్వహించారు. ఉదయం 9 గంటలకు గవ్యాంత పూజలు, వాస్తు పూజ, హోమం, రుద్రాభిషేకం, రుద్రహోమం, ప్రాతరౌపాసన, నిత్యబలిహరణ, సాయంత్రం 4 గంటలకు సాయమౌపాసన, బలిహరణం, నీరాజనం, మంత్రపుష్పం, నందివాహన సేవ, తీర్థ ప్రసాద వితరణ చేపట్టారు.

వైభవంగా ప్రభోత్సవం

అచ్చంపేటలోని భ్రమరాంబ ఆలయంలో సోమవారం రాత్రి 8.30 గంటలకు ప్రభోత్సవం ప్రారంభమై మంగళవారం రాత్రి 3 గంటల వరకు పట్టణంలో ఊరేగించారు. ముందుగా పార్వతి, పరమేశ్వరుల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ కార్యక్రమంలో పాల్గొన్నారు. లారీపై ప్రత్యేకంగా అలంకరించిన శేషవాహనంపై పార్వతి, పరమేశ్వరులను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు జరిపి.. ఊరేగింపుగా తీసుకెళ్లారు. భ్రమరాంబ ఆలయం వారు ఏర్పాటు చేసిన ప్రభోత్సవం ఎంతగానో ఆకట్టుకుంది. భక్తుల చెక్కభజనలు, మహిళలు, యువతులు, చిన్నారుల కోలాటాలు, డప్పు వాయిద్యాలతో ప్రదర్శనలు నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ నర్సింహగౌడ్, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు మనోహర్, బీజేపీ ఓబీసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలాజీ, భ్రమరాంబ ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి గౌరీశంకర్, కోశాధికారి భగీర్‌నాథ్, ఉపాధ్యక్షుడు రామనాథం తదితరులు పాల్గొన్నారు.



అచ్చంపేటలో ఊరేగిస్తున్న ప్రభోత్సవం



మత సామరస్యానికి ప్రతీక..

నిరంజన్ షావలీ సమాధి

రంగాపూర్ నిరంజన్ షావలి దర్గా

- నేడు గంధోత్సవం.. రేపు ఉర్సు ఉత్సవాలు ప్రారంభం
- వారంరోజులపాటు నల్లమలలో సంబరాలు



అచ్చంపేట: ఉమ్మడి పాలమూరు జిల్లాలో ప్రసిద్ధిగాంచిన జాతరల్లో రంగాపూర్ ఒకటి. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచే అతిపెద్ద రెండో ఉర్సు నిరంజన్ షావలి దర్గాలో బుధవారం రాత్రి నుంచి వారం రోజుల పాటు అత్యంత వైభవంగా వేడుకలు జరుగుతాయి. అచ్చంపేట మండలం రంగాపూర్‌లో జరిగే ఉర్సు నల్లమల ప్రజలకు ప్రత్యేక సంబరాలు. హిందు, ముస్లింలు తేడా లేకుండా ఉర్సుకు జిల్లా నలుమూలల నుంచే కాక రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. భక్తులు దర్గాను సందర్శించి మొక్కులు చెల్లిస్తే కోరిన కోర్కెలు తీరుతాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. భక్తులు ఉత్సవాల్లో పాల్గొని మొక్కులు ఉన్నవారు కందూరు చేసి మేకలు, గొర్రెలను బలి ఇస్తారు. ఉర్సు రంగాపూర్‌గా పిలిచే ఈ దర్గాను భక్తులు ఏడాది పొడవునా దర్శించుకొని మొక్కులు చెల్లించుకుంటారు. అమ్రాబాద్ మండలం ప్రజలు ఏ శుభకార్యం చేసినా మొదట దర్గాను దర్శించుకుని తమ కార్యక్రమాలు ప్రారంభిస్తారు.

ఏర్పాట్లు పూర్తి..

బుధవారం రాత్రి గంధోత్సవం, ఉర్సును దర్గ తండా, రంగాపూర్ పంచాయతీ, దర్గా కమిటీ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. గంధం మొదటి రోజు దర్గా ఆవరణలో ఖవాలీ, జియారత్‌తోపాటు వారం రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. గురువారం ఉదయం 11 గంటలకు దీపారాధన, శుక్రవారం ఉదయం 11 గంటలకు జారత్ ఉంటుంది. పంచాయతీ సర్పంచ్‌లు సక్రిబాయి, లోక్యానాయక్ జాతరలో భక్తులు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు.

గంధోత్సవం..

అచ్చంపేటలోని నారాయణ ప్రసాద్ ఇంటి నుంచి గంధాన్ని తీసుకెళ్లడం ఆనవాయితీ. బుధవారం రాత్రి అచ్చంపేట మహబూబ్ స్వామి దర్గాతోపాటు మన్ననూర్, అమ్రాబాద్, బల్మూర్, లింగాల, ఉప్పునుంతల, బొమ్మనపల్లి, పెనిమిళ్ల, నాగర్‌కర్నూల్, తెలకపల్లి, కొల్లాపూర్, వనపర్తి, మహబూబ్‌నగర్ ప్రాంతాల నుంచి గంధాన్ని ఊరేగింపుగా తీసుకువస్తారు. బొమ్మనపల్లి నుంచి గంధాన్ని గుర్రంపై తీసుకు రావడం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. గ్రామాల నుంచి బయలు దేరిన గంధోత్సవాలు అర్ధరాత్రి రంగాపూర్‌కు చేరుకుంటాయి. అన్ని ప్రాంతాల నుంచి గంధోత్సవాలు చేరుకోగానే భక్తులు రెట్టించిన ఉత్సాహంతో నృత్యాలు చేస్తూ వేడుకల్లో పాల్గొంటారు. గురువారం తెల్లవారుజామున ఉర్సు ప్రారంభమై వారం రోజులపాటు కొనసాగుతుంది.

ప్రత్యేక బస్సులు

రంగాపూర్ నిరంజన్ షావలీ ఉర్సు, ఉమామహేశ్వర బ్రహ్మోత్సవాల సందర్భంగా అచ్చంపేట ఆర్టీసీ డిపో నుంచి ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. అచ్చంపేట– రంగాపూర్ వరకు 15 ఆర్టీసీ బస్సులు, అచ్చంపేట– రంగాపూర్– ఉమామహేశ్వర కొండపైకి 6 మినీ బస్సులు, హైదరాబాద్– అచ్చంపేట, నాగర్‌కర్నూల్– అచ్చంపేట, వనపర్తి, కొల్లాపూర్– అచ్చంపేటకు బస్సులు నడిపిస్తున్నట్లు డీఎం మనోహర్ తెలిపారు.

చింతలకుంటకు పోటెత్తిన భక్తులు



ఆంజనేయస్వామి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు



స్వామివారిని దర్శించుకుంటున్న బంగారు శ్రుతి

- ఆంజనేయస్వామికి కోళ్లు, పొట్టేళ్లు బలిచ్చి ప్రత్యేక పూజలు

పెబ్బేరు రూరల్: మండలంలోని పాతపల్లి చింతల కుంట ఆంజనేయస్వామి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సంక్రాంతిని పురస్కరించుకొని నిర్వహించిన వేడుకలకు భక్తులు తరలివచ్చి కోళ్లు, పొట్టేళ్లు బలిచ్చి.. కల్లుతో నైవేద్యాలు పెట్టారు ఆటోలు, ద్విచక్రవాహనాలు, ట్రాక్టర్లు ఇతరత్రా వాహనాలు ఆలయం చుట్టూ తిప్పి ప్రత్యేక పూజలు చేశారు. చింతలకుంటవాస గోవిందా.. గోవిందా అనే నామస్మరణతో పరిసరాలు మార్మోగాయి. సోమవారం మకర సంక్రాంతి సందర్భంగా బీజేపీ రాష్ట్ర నాయకురాలు బంగారు శ్రుతి స్థానిక నాయకులతో కలిసి స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆమెకు స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఉత్సవాల సందర్భంగా పెబ్బేరు పోలీసుల ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. భక్తుల రద్దీని నియంత్రించేందుకు బారికేడ్లు ఏర్పాటు చేశారు.

రైతుల ఉత్సాహానికే బండలాగుడు పోటీలు

- రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



పెద్దకార్పాములలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

పెద్దకొత్తపల్లి: ఎలాంటి బెట్టింగులు లేకుండా రైతుల ఉత్సాహం కోసమే వృషభ రాజముల పోటీలు నిర్వహిస్తున్నారని రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో, మంగళవారం మండలంలోని పెద్దకార్పాములలో అంతర్రాష్ట్ర వృషభ రాజాల పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఉగాది పండుగకు రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో వివిధ రకాల క్రీడా పోటీలు నిర్వహించనున్నట్లు వివరించారు. పెద్దకొత్తపల్లిలో జరిగిన పోటీల్లో గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన చంద్రన్న ఎద్దులు మొదటి బహుమతిని గెలువగా రూ.50 వేలు, మెమొంటోను మంత్రి అందజేశారు. అలాగే రెండో బహుమతిని నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం రాయవరానికి చెందిన అనన్యరెడ్డి ఎద్దులు, మూడో బహుమతిని గద్వాల జిల్లా అయిజ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన అజయ్‌కుమార్ ఎద్దులు, నాలుగో బహుమతిని గద్వాల జిల్లా మల్దకల్ మండలం రాయల చెరువుకు వెంకన్న ఎద్దులు, ఐదో బహుమతిని కర్నూలు జిల్లా ఎనగండ్లకు జానకిరాముడు ఎద్దులు గెలుచుకున్నాయి. విజేతలకు మంత్రి నగదు, బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చింతలపల్లి జగదీశ్వర్ రావు, జెడ్పీటీసీ సభ్యురాలు మేకల గౌరమ్మ, ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, పెద్దకొత్తపల్లి సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు శశికళ, అశోక్ రెడ్డి, ఆర్.శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్, మహేష్, లక్ష్మయ్య పాల్గొన్నారు.



పెద్దకొత్తపల్లిలో బండ లాగుతున్న వృషభరాజాలు

■ పెద్దకార్పాములలో మంగళవారం ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్ బహుమతులు అందజేశారు. గద్వాల జిల్లా ఎర్రవల్లి మండలం ధర్మవరం గ్రామానికి చెందిన చంద్రన్న ఎద్దులు మొదటి బహుమతిని, అదే జిల్లా గట్టు మండలం గొర్లఖాన్‌దొడ్డికి చెందిన కుర్వ కర్రెన్న ఎద్దులు రెండో బహుమతిని, నాగర్‌కర్నూల్ జిల్లా లింగాల మండలం రాయవరానికి చెందిన అనన్యరెడ్డి ఎద్దులు మూడో బహుమతిని, గద్వాల జిల్లా అయిజ మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన అజయ్ కుమార్ ఎద్దులు నాలుగో బహుమతిని, నంద్యాల జిల్లా వెలుగోడుకు చెందిన అయ్యూబ్‌బాషా ఎద్దులు ఐదో బహుమతిని గెలుచుకున్నాయి.

నేషనల్ నెట్‌బాల్ చాంపియన్‌గా హర్యానా

- రన్నరప్‌గా నిలిచిన తెలంగాణ పురుషుల జట్టు
- తెలంగాణ మహిళా జట్టుకు మూడోస్థానం
- ముగిసిన ఫాస్ట్–5 నేషనల్ నెట్‌బాల్ పోటీలు

మహబూబ్‌నగర్ క్రీడలు: జిల్లాకేంద్రంలోని క్రీడాశాఖ మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో 2వ ఫాస్ట్–5 సీనియర్ నేషనల్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ మంగళవారం ఘనంగా ముగిసింది. ఈ టోర్నీలో 28 రాష్ట్రాల నుంచి 850 మందికిపైగా క్రీడాకారులు హాజరయ్యారు. ఈ పోటీల్లో పురుషుల, మహిళా విభాగాల్లో హర్యానా జట్లు ఆధిపత్యం ప్రదర్శించి చాంపియన్‌షిప్‌లను కైవసం చేసుకున్నాయి. పురుషుల విభాగంలో రన్నరప్‌గా తెలంగాణ, మహిళా విభాగాల్లో మూడోస్థానంలో తెలంగాణ–ఢిల్లీ జట్లు, పురుషుల విభాగంలో మూడోస్థానంలో పంజాబ్–కేరళ జట్లు నిలిచాయి.

■ పురుషుల విభాగం ఫాస్ట్–5 సీనియర్ నేషనల్ నెట్‌బాల్ చాంపియన్‌షిప్ ఫైనల్ మ్యాచ్ తెలంగాణ–హర్యానా జట్ల మధ్య హోరాహోరీగా సాగింది. రెండు అర్ధభాగాల్లో తెలంగాణ జట్టు మెరుగైన ప్రదర్శన కనబరిచి చివరి రెండు అర్ధభాగాల్లో క్రీడాకారులు ఒత్తిడిలోనై మ్యాచ్‌లో పట్టును కోల్పోయారు. హర్యానా జట్టు 32–20 గోల్స్ తేడాతో తెలంగాణపై విజయం సాధించింది. మహిళా విభాగంలో ఫైనల్ మ్యాచ్‌లో హర్యానా జట్టు 43–23 గోల్స్ తేడాతో కర్ణాటక జట్టుపై గెలుపొందింది.

■ నేషనల్ నెట్‌బాల్ పోటీల్లో విన్నరప్, రన్నరప్, మూడోస్థానాల్లో నిలిచిన జట్లకు మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి ట్రోఫీలు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లాకేంద్రంలో నిర్వహించిన ఫాస్ట్–5 నేషనల్ నెట్‌బాల్ టోర్నీలో వివిధ రాష్ట్రాల జట్లు పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. జిల్లాకు జాతీయస్థాయి నెట్‌బాల్ టోర్నీ నిర్వహించడానికి అవకాశం ఇవ్వడం అభినందనీయమన్నారు. టోర్నీ నుంచి క్రీడాకారులు ఇక్కడి జ్ఞాపకాలు, అనుభూతులను తీసుకెళ్లాలన్నారు. క్రీడల్లో గెలుపు, ఓటములను సమానంగా స్వీకరించాలని, క్రీడాస్ఫూర్తి చాటాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పురుషుల విభాగం తెలంగాణ–హర్యానా జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్‌ను తిలకించారు. కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి ఎస్.శ్రీనివాస్, నెట్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎఫ్ఐ) సెక్రటరీ జనరల్ విజేందర్‌సింగ్, అంపైర్‌బోర్డు చైర్మన్ అశోక్ అనంద్, కన్వీనర్ ఆకాష్‌బత్ర, ఎన్ఎఫ్ఐ ఉపాధ్యక్షులు గిరిష్ సి.గౌడ, నెట్‌బాల్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్ష, కార్యదర్శులు విక్రం ఆదిత్యరెడ్డి, ఖాజాఖాన్, సీనియర్ ఉపాధ్యక్షులు సురేష్‌కుమార్, టోర్నీ ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ సాదత్‌ఖాన్, కోశాధికారి సోహైల్‌ఖాన్, రాంమోహన్‌గౌడ్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి వినోద్‌కుమార్, కాంగ్రెస్ నాయకుడు ఆశాదీప్‌రెడ్డి, కౌన్సిలర్ మొయిన్‌అలీ, గోపాలకృష్ణ, షకీల్, అక్రం తదితరులు పాల్గొన్నారు.



మహిళా విభాగం మూడోస్థానంలో నిలిచిన తెలంగాణ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం



ఫైనల్‌లో తలపడుతున్న తెలంగాణ–హర్యానా పురుషుల జట్లు



పురుషుల విభాగం విన్నర్‌గా నిలిచిన హర్యాన జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

క్లుప్తంగా...

జేఈఈ అభ్యర్థులకు రూట్‌మ్యాప్

సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్స్ పరీక్షలకు సంబంధించిన ఏర్పాట్లు వేగంగా పూర్తి చేస్తున్నట్టు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) తెలిపింది. ఈ నెల 24న పేపర్–1 (ఆర్కిటెక్చర్) జరుగుతుంది. ఈ పరీక్ష రాసే విద్యార్థులకు ఇప్పటికే పరీక్ష కేంద్రం వివరాలను https://jeemain.nta. nic.in వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్టు తెలిపింది. అయితే అడ్మిట్ కార్డులను మాత్రం ఇంకా విడుదల చేయలేదు. ఈ నెల 27న జేఈఈ మెయిన్స్ పేపర్–2 జరుగుతుంది. ఈ పరీక్ష రాసే వారి కేంద్రాల వివరాలను త్వరలో అందుబాటులోకి తెస్తున్నట్టు ఎన్‌టీఏ తెలిపింది. మెయిన్స్ పరీక్షలు ఫిబ్రవరి 1 వరకూ జరుగుతాయి.

తిరుమలలో సుప్రభాత సేవ పునఃప్రారంభం

తిరుమల: పవిత్రమైన ధనుర్మాసం ఆదివారం ముగియడంతో సోమవారం నుంచి తిరుమల శ్రీవారి ఆలయంలో సుప్రభాత సేవ పునఃప్రారంభమైంది. గతేడాది డిసెంబర్ 17వ తేదీ నుంచి జనవరి 14వ తేదీ ధనుర్మాస ఘడియలు కావడంతో శ్రీవారి ఆలయంలో సుప్రభాతం స్థానంలో గోదా తిరుప్పావై పారాయణం కొనసాగింది. కాగా, శ్రీవారికి మహా భక్తురాలైన శ్రీగోదాదేవి పరిణయోత్సవాన్ని పురస్కరించుకుని గోదామాలలు శ్రీవారి మూలవిరాట్‌కు మంగళవారం అలంకరించారు.

అజ్మీర్ షరీఫ్ రైలు ప్రారంభం

నాంపల్లి (హైదరాబాద్): అజ్మీర్ షరీఫ్–హైదరాబాద్ ప్రత్యేక రైలును సోమవారం నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ జెండా ఊపి ప్రారంభించారు. హైదరాబాద్ నుంచి అజ్మీర్‌కు వెళ్తున్న యాత్రికులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. యాత్ర విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు హైదరాబాద్ రైల్వే స్టేషన్‌లో బయలుదేరిన ఈ రైలు.. ఈ నెల 17వ తేదీన ఉదయం 8.30 గంటలకు రాజస్తాన్‌లోని అజ్మీర్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంటుంది.

ఇద్దరు రాష్ట్ర అధికారులకు ఐఏఎస్ హోదా

సాక్షి, హైదరాబాద్: ఇద్దరు రాష్ట్ర ప్రభుత్వ అధికారులకు కేంద్ర ప్రభుత్వం ఐఏఎస్ హోదా కల్పించింది. రాష్ట్ర ఆదాయ పన్నుల శాఖలో పనిచేస్తున్న కె.సీతాలక్ష్మి, జి.ఫణీంద్రా రెడ్డికి ఐఏఎస్ హోదా కల్పిస్తూ కేంద్ర సిబ్బంది, శిక్షణ శాఖ(డీవోపీటీ) సోమవారం ఆదేశాలు జారీ చేసింది.

పోలీస్ స్పందన 7 నిమిషాల్లో..

'100 యాప్'తో పెట్రోలింగ్ పర్యవేక్షణ

- 2023లో సరాసరి లెక్కించిన పోలీసులు
- ఈ ఏడాది ఇంకా తగ్గించేలా ప్రణాళిక
- గ్రామీణ ప్రాంతాల్లో మరింత మెరుగుపడే దిశగా అడుగులు



సాక్షి, హైదరాబాద్: ఏదైనా సంఘటన చోటుచేసుకున్న వెంటనే బాధితులు లేదా అక్కడ ఉన్న వారు వెంటనే డయల్ 100కు కాల్ చేస్తారు. ఆ కాల్ రిసీవ్ చేసుకున్నాక ఎంత తక్కువ సమయంలో పోలీసులు ఆ స్థలానికి చేరుకుంటే అంత మెరుగైన ఫలితాలు వస్తాయి. దీనినే సాంకేతికంగా 'పోలీస్ రెస్పాన్స్ టైమ్'అంటారు. గస్తీ విధానంలో జవాబుదారీతనం పెంచడం, నేరాలు చోటు చేసుకునే ప్రాంతాల్లోనే పెట్రోలింగ్ జరిగేలా చూడటం తదితర లక్ష్యాలతో ఓ యాప్ అందుబాటులోకి తీసుకొచ్చారు. దీని ద్వారా 2023కు సంబంధించి రెస్పాన్స్ టైమ్‌ను లెక్కించారు. ప్రస్తుతం రాష్ట్రంలో సరాసరిన ఈ సమయం ఏడు నిమిషాలుగా ఉండగా, ఈ ఏడాది మరింత తగ్గించాలనేది పోలీసులు టార్గెట్‌గా పెట్టుకున్నారు.

ఒకప్పుడు ఇలా...

ఎవరైనా '100'కు కాల్ చేస్తే, అది నేరుగా 'డయల్–100'కమాండ్ సెంటర్‌కు చేరుతుంది. వెంటనే వారు బాధితుడు ఏ ఠాణా పరిధిలోకి వస్తాడో వాకబు చేస్తారు. ఆ తర్వాత సదరు ఫోన్ కాల్‌లోని అంశాలను సంక్షిప్త సందేశంగా (టెక్స్ట్) మార్చి బాధితుడున్న ఏరియాలోకి వచ్చే ఠాణాతో పాటు జోన్ కార్యాలయం, కమిషనరేట్‌కు చెందిన ప్రధాన కంట్రోల్ రూమ్‌లోని కంప్యూటర్లకు పంపించేవారు. దీంతో పాటు వాకీటాకీ ద్వారానూ సమాచారం ఇచ్చి గస్తీ వాహనాలను అప్రమత్తం చేసేవారు. ఈ సమాచారం అందుకునే గస్తీ వాహనం ఎక్కడ ఉంది? బాధితుడికి ఎంత దూరంలో ఉంది? తదితర అంశాలు తెలుసుకునే అవకాశం ఉండేదికాదు. ఫలితంగా గస్తీ వాహనం బాధితుడి వద్దకు చేరే సమయం చాలా ఎక్కువగా ఉండేది. ఘటనాస్థలికి చేరిన తర్వాత పెట్రోలింగ్ సిబ్బంది చెప్పే అంశాల ఆధారంగా ఫిర్యాదుగా పరిగణించే ఫోన్ కాల్‌ను క్లోజ్ చేసేవారు.

ఇప్పుడు...ట్యాబ్‌నే 'జీపీఎస్'

బాధితుడు '100'కు ఫోన్ చేసి సహాయం కోరిన వెంటనే అక్కడి సిబ్బంది సదరు ఫిర్యాదుదారుడు ఉన్న ప్రాంతాన్ని అడిగి తెలుసుకుంటున్నారు. సిటీలోని ప్రతి గస్తీ వాహనం, బ్లూకోల్ట్స్‌లకు పోలీసు విభాగం ట్యాబ్స్ అందించింది. ఇవే జీపీఎస్ పరికరంగా పనిచేస్తుండటంతో దాని ఆధారంగా 'డయల్–100'సిబ్బందికి ఏ వాహనం ఏ ప్రాంతంలో ఉందో కంప్యూటర్ తెర/ట్యాబ్/ప్రత్యేక యాప్ ద్వారా కచ్చితంగా తెలుస్తుంది. దీంతో బాధితుడు ఉన్న ప్రాంతానికి సమీపంలో ఉన్న వాహనానికే నేరుగా ఆ ఫోన్ కాల్ డైవర్ట్ చేస్తున్నారు. ఈ తతంగం మొత్తం కేవలం కొన్ని సెకన్ల వ్యవధిలో పూర్తయ్యేలా ఏర్పాట్లు చేశారు. పెట్రోలింగ్ వాహనాల్లో ఉండే సిబ్బంది ఫోన్లకు '100'నుంచి డైవర్ట్ అయిన కాల్ వస్తే.. ప్రత్యేక రింగ్‌టోన్ ద్వారా ట్యాబ్‌లో రింగ్ వస్తుంది. ఫోన్ ఎక్కడ నుంచి అనేది తేలిగ్గా తెలియడానికి అన్ని వాహనాల్లోని సిబ్బందికీ ఇలాంటి రింగ్‌టోన్ ఏర్పాటు చేశారు. ఆ సిబ్బంది ఫోన్ ఎత్తిన వెంటనే ఆ ట్యాబ్‌లో తెరపై ఓ నోటిఫికేషన్ ప్రత్యక్షమవుతుంది. అందులో బాధితుడు/ఫిర్యాదుదారుడికి సంబంధించిన అంశాలు, ఫిర్యాదు ఏమిటన్నవి కనిపిస్తాయి. వీటిని చూసిన వెంటనే గస్తీ వాహనంలోని సిబ్బంది 'రిసీవ్'అనే బటన్ నొక్కడం ద్వారా ఫిర్యాదు అందుకున్నట్టు ధ్రువీకరిస్తున్నారు.

అలా...గణన షురూ..

పెట్రోలింగ్ వాహనం, బ్లూకోల్ట్స్ సిబ్బంది ఒకసారి ఫిర్యాదు అందుకున్నట్టు ట్యాబ్‌లో ఉండే '100 యాప్'ద్వారా ధ్రువీకరించిన వెంటనే 'రెస్పాన్స్ టైమ్'లెక్కింపు ప్రారంభమవుతోంది. ఘటనాస్థలికి చేరుకునే గస్తీ వాహనాలు ఫిర్యాదు తీరును బట్టి అవసరమైన రీతిలో స్పందించే విధంగా సాంకేతిక చర్యలు తీసుకున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే క్షతగాత్రులకు అవసరమైన సహాయం అందించడంతో పాటు, ఆధారాల కోసం ఫొటోలు తీసుకుంటున్నారు. పబ్లిక్ ప్లేస్‌లో జరిగే గొడవలు, ఇతర నేరాలకు సంబంధించిన ఫిర్యాదు అయితే స్థానిక పోలీసులను అప్రమత్తం చేస్తారు. దీంతో ఘటనాస్థలాల్ని వీడియోలో చిత్రీకరించి భద్రపరుస్తున్నారు. సహాయక చర్యలు, తదుపరి యాక్షన్స్ తీసుకోవడం పూర్తయిన వెంటనే సదరు ఫొటోలు, వీడియోలు ఆన్‌లైన్ ద్వారానే సంబంధిత స్టేషన్ హౌస్‌ఆఫీసర్‌కు పంపిస్తున్నారు.

'క్లోజ్'చేసే వరకు 'టైమ్ రన్నింగ్'...

గస్తీ బృందాలు ఘటనాస్థలికి చేరుకోవడం వంటి చర్యలు పూర్తయిన తర్వాత మొదట వచ్చిన నోటిఫికేషన్ మళ్లీ ఓపెన్ చేయాలి. అందులో ఉండే 'కాల్ క్లోజ్'బటన్ నొక్కడంతో ఈ వ్యవహారం పూర్తవుతుంది. అప్పటి వరకు సమయం లెక్కింపు జరుగుతూ ఉంటుంది. ఈ సమయాన్నే 'పోలీసు రెస్పాన్స్ టైమ్'గా పరిగణిస్తున్నారు. ఫోన్‌కాల్ వచ్చిన దగ్గర నుంచి జరిగే ప్రతిదీ 'డయల్–100'తో పాటు కమిషనరేట్ కంట్రోల్ రూమ్, జోనల్ కార్యాలయాలకు చేరుతూ పర్యవేక్షణకు దోహదం చేస్తున్నాయి. ప్రస్తుతం ఈ రెస్పాన్స్ టైమ్ పట్టణాల్లో తక్కువగా, గ్రామాల్లో ఎక్కువగా ఉంటోంది. ఈ నేపథ్యంలోనే ఈ ఏడాది అన్ని ప్రాంతాల్లోనూ తగ్గేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు.

రాజధానిలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణపై ఫోకస్

జీహెచ్ఎంసీ పరిధిలో ట్రాఫిక్‌పై సీనియర్ పోలీస్ అధికారులతో డీజీపీ సమీక్ష



సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ) పరిధిలోని ట్రాఫిక్ పరిస్థితిపై రాష్ట్ర డీజీపీ రవిగుప్తా సీనియర్ పోలీసు అధికారులతో మంగళవారం సమీక్ష నిర్వహించారు. వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా జీహెచ్ఎంసీ పరిధిలో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించడానికి, మెరుగుపరచడానికి సమర్థవంతమైన చర్యలపై పోలీస్ అధికారులు సూచనలు ఇవ్వాలని డీజీపీ కోరారు. విజిబుల్ పోలీసింగ్ అమలు, ట్రాఫిక్ సిబ్బందికి ఆధునిక శిక్షణ అందించడం వంటి అంశాలపై అధికారులు చర్చించారు. జీహెచ్ఎంసీ పరిధిలో కొత్త స్కైవాక్‌లు, ఫ్లైఓవర్ల చుట్టూ ట్రాఫిక్ పరిస్థితులను వివరిస్తూ ట్రాఫిక్ పోలీసు అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్‌ను డీజీపీకి వివరించారు. మూసీనది ప్రాంతంలో వంతెనల పరిస్థితి, ప్రతిపాదిత ట్రాఫిక్ అవగాహన కార్యక్రమాలు, శిక్షణాకేంద్రం ఏర్పాటుపై అధికారులు దృష్టి పెట్టాలని డీజీపీ సూచించారు. డీజీపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఇంటెలిజెన్స్ చీఫ్ బి.శివధర్‌రెడ్డి, సైబరాబాద్ సీపీ అవినాశ్ మహంతి, రాచకొండ సీపీ సుధీర్‌బాబు, హైదరాబాద్ అదనపు కమిషనర్ విక్రమ్‌సింగ్ మాన్, హైదరాబాద్ ట్రాఫిక్ అదనపు కమిషనర్ విశ్వప్రసాద్, ఐజీ తరుణ్ జోషి తదితరులు పాల్గొన్నారు.

ఫైళ్ల మాయం, అక్రమాలపై ఏసీబీ దర్యాప్తు

- పశుసంవర్ధకశాఖలో అక్రమాలపై ముమ్మర విచారణ
- ఏసీబీకి కేసుల బదిలీ

సాక్షి, హైదరాబాద్: పశుసంవర్ధకశాఖలో ఫైళ్ల మాయం, గొర్రెల పంపిణీ పథకంలో అక్రమాలపై అవినీతి నిరోధకశాఖ దర్యాప్తు ముమ్మరం చేసింది. ఈ రెండు కేసులను ప్రభుత్వం ఏసీబీకి బదిలీ చేసింది. గత ప్రభుత్వ హయాంలో జరిగిన గొర్రెల పంపిణీ పథకంలో పెద్దఎత్తున నిధుల గోల్‌మాల్ జరిగినట్టు అందిన ఫిర్యాదు మేరకు ఇప్పటికే గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. నాంపల్లిలోని పశుసంవర్ధకశాఖ కార్యాలయంలో ఫైళ్లను మాయం చేసేందుకు ప్రయత్నించడంపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ రెండు కేసులలో భారీ అవినీతికి ఆస్కారం ఉన్నందున లోతైన దర్యాప్తు బాధ్యతను ఏసీబీకి ప్రభుత్వం అప్పగించింది. గొర్రెల కొనుగోలు యూనిట్లకు నగదు చెల్లింపుల్లో.. అవినీతి, పశుసంవర్ధకశాఖ ఫైళ్లను మాయం చేసేందుకు జరిగిన కుట్రలో దాగిన మరిన్ని నిజాలను వెలుగులోకి తెచ్చేందుకు ఏసీబీ అధికారులు దర్యాప్తు ముమ్మరం చేసినట్టు తెలిసింది. ఈ రెండు కేసుల దర్యాప్తు కోసం ప్రత్యేక బృందాలను ఏసీబీ రంగంలోకి దింపినట్టు సమాచారం.

తిరుగు ప్రయాణాలతో హైవే రద్దీ

సంక్రాంతికి పల్లెలకు వెళ్లినవారు పట్నంబాట



గూడూరు టోల్‌ప్లాజా వద్ద వాహనాల రద్దీ

చౌటుప్పల్/బీబీనగర్: సంక్రాంతి పండుగకు స్వస్థలాలకు వెళ్లి న తెలుగు రాష్ట్రాల ప్రజలు తిరుగు ప్రయాణమవడంతో హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారిపై మంగళవారం వాహనాల రద్దీ ప్రారంభమైంది. హైదరాబాద్ మార్గంలో కార్లు, ఇతర సొంత వాహనాలు పెద్దసంఖ్యలో బారులుదీరాయి. ఈ రద్దీ సాయంత్రం తర్వాత పెరిగే అవకాశాలు ఉన్నా యని భావించిన పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. పెట్రోలింగ్ టీంలను అందుబాటులో ఉంచారు. యాదాద్రి జిల్లా చౌటుప్పల్ పట్టణంలోని ఆర్టీ సీ బస్‌స్టేషన్, తంగడపల్లి చౌరస్తా, వలిగొండ చౌర స్తా వద్ద ఉన్న జంక్షన్లను తాత్కాలికంగా మూసివేశారు. ఆయా ప్రాంతాల మీదుగా రాకపోకలు సాగించే వాహనాలను ఇతర మార్గాలకు మళ్లించారు. దీంతో తమకు ఎదురవుతున్న ఇబ్బందులపై స్థానికులు, వాహనదారులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జంక్షన్ల వద్ద విధుల్లో ఉన్న పోలీసులతో వాగ్వాదానికి దిగారు. తాము కిలోమీటర్ల దూరం వెళ్లి యూటర్న్ తీసుకోవడం ఇబ్బందిగా ఉందని, ఇక్కడి నుంచే పంపించాలని పట్టుబట్టారు.దీంతో సుమారు అరగంటసేపు అయోమయపరిస్థితులు నెలకొన్నాయి. ఈ క్రమంలో పోలీసులు జంక్షన్ల వద్ద వాహనాల రాకపోకలను పునరుద్ధరించారు. ఇదే సమయంలో వాహనదారులు సర్వీస్ రోడ్లలోకి వెళ్లారు. దీంతో ఇరువైపులా ఉన్న సర్వీస్‌రోడ్లు వాహనాలతో రద్దీగా మారాయి. ఎదురెదురుగా వచ్చిన వాహనాలు కొద్దిసేపు స్తంభించాయి. కాగా,యాదాద్రి జిల్లా బీబీనగర్ మండలం గూడూరు టోల్‌ప్లాజా వద్ద విపరీతమైన రద్దీ నెలకొంది. టోల్‌ప్లాజా నుంచి పగిడిపల్లి వరకు వాహనాలు సాయంత్రం నుంచి రాత్రి 9గంటల దాకా బారులుదీరాయి.

మైనారిటీ గురుకులాల్లో.. రేపటి నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (టీఎంఆర్ఈఐఎస్) పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లో ప్రవేశాలకు ఈనెల 18వ తేదీ నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యా సంస్థల సొసైటీ కార్యదర్శి ఆయేషా మసరత్ ఖానమ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సొసైటీ పరిధిలోని 204 పాఠశాలల్లో 5వ తరగతితో పాటు 6,7,8 తరగతుల్లోని బ్యాక్‌లాగ్ ఖాళీల భర్తీ, జూనియర్ కళాశాలల్లో ప్రథమ సంవత్సరం ప్రవేశాలు, 10 సీవోఈ (సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్)ల్లో ప్రవేశాలకు ఆన్‌లైన్ పద్ధతిలో ఫిబ్రవరి 6వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎంఆర్ఈఐఎస్‌తెలంగాణ.సీజీజీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో లేదా టీఎంఆర్ఈఐఎస్ మొబైల్ యాప్ ద్వారా దరఖాస్తు సమర్పించవచ్చు. యాప్‌ను గూగుల్ ప్లేస్టోర్ ద్వారా ఇన్‌స్టాల్ చేసుకోవాలి. మైనార్టీ విద్యార్థులతో పాటు నాన్ మైనార్టీ విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. మరిన్ని వివరాలకు సొసైటీ వెబ్‌సైట్‌లో లేదా జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కార్యాలయంలో లేదా మైనార్టీ గురుకుల పాఠశాలల్లో సంప్రదించాలని సూచించారు. ప్రవేశాల ప్రక్రియ కోసం సొసైటీ కార్యాలయంలో ప్రత్యేకంగా 040–23437909 హెల్ప్‌లైన్ నంబర్‌ను అందుబాటులోకి తెచ్చినట్టు పేర్కొన్నారు.

బైక్ అదుపుతప్పి భర్త మృతి

- భార్య, కుమార్తెకు గాయాలు

ఊట్కూరు: మండలంలోని బిజ్వార్ గ్రామ సమీపంలో మంగళవారం రోడ్డు ప్రమాదంలో నారాయణపేటకు చెందిన వెంకటప్ప(40) మృతిచెందగా ఆయన భార్య, కుమార్తెలకు గాయాలైన సంఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. నారాయణపేటకు చెందిన బుడగజంగం వెంకటప్ప ద్విచక్ర వాహనంపై ఆయన భార్య వెంకటమ్మ, కుమార్తె లక్ష్మితో కలిసి పులిమామిడికి వెళ్లి తిరిగి వస్తున్నాడు. బిజ్వార్ గ్రామ సమీపంలో రోడ్డు మలుపు వద్ద అదుపు తప్పి కింద పడిపోయాడు. దీంతో వెంకటప్ప అక్కడికక్కడే మృతిచెందగా.. ఆయన భార్య వెంకటమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. మహ బూబ్‌నగర్ ఆస్పత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. కుమార్తె లక్ష్మికి చేయి విరగడంతో నారాయణపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈయన కూలి పని చేసి జీవనం గడిపేవాడు. ఈ విషయమై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోకరి తెలియజేశారు.

చేపల వలలో చిక్కుకుని రైతు..

పాన్‌గల్: చెరువులో బోరుమోటారు చుట్టూ వేసిన వలలో చిక్కుకుని వ్యక్తి మృతిచెందిన సంఘటన సోమవారం మండలంలో చోటుచేసుకుంది. ఎస్ఐ వేణు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని చిక్కేపల్లికి చెందిన ఆంజనేయులు(48) గ్రామ శివారులోని చెరువులో బోరు మోటార్ వేశాడు. ఫుట్‌బాల్ చుట్టూ చెత్త చేరకుండా ఉండేందుకు వల వేసి ఉంచాడు. దానిని తీసే క్రమంలో వలలో చిక్కుకుని నీటిలో మునిగి మృతిచెందాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని తెలియజేశారు. ఇంటి యజమాని మృత్యువాత పడటంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. అతని భార్య, కుమార్తె ఉన్నారు.

ట్రాక్టర్ పైనుంచి కిందపడి పారిశుద్ధ్య కార్మికుడు..

మదనాపురం: మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామపంచాయతీ పారిశుద్ధ్య కార్మికుడు తిరుపతయ్య(52) చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం మృతిచెందాడు. పది రోజుల కిందట గ్రామపంచాయతీకి సంబంధించిన ట్రాక్టర్‌పై వెళ్లి ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. దీంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ఎస్వీఎస్ హాస్పిటల్‌కి తరలించారు. చికిత్స పొందుతూ ఈ తెల్లవారుజామున మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య సంతోషమ్మ, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

కల్లు విక్రయాలకు రాజకీయ రంగు

- పరస్పర దాడులకు పూనుకుంటున్న వైనం
- కల్లు పెట్టెలు, సీసాలు ధ్వంసం.. గుడిసె దగ్ధం
- పట్టణ, రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసులు నమోదు



నది అగ్రహారంలో కాలిబూడిదైన గుడిసె



జమ్మిచేడ్‌లో కల్లు సీసాల ధ్వంసం

గద్వాల క్రైం: 'మాకు లైసెన్స్ ఉంది.. కల్లు విక్రయాలు మేమే కొనసాగిస్తామని ఓ వర్గం.. లేదు మా ప్రభుత్వం నడుస్తుంది, ఇక నుంచి విక్రయాలు మేమే కొనసాగిస్తామని మరో వర్గం' పరస్పర దాడులకు దిగిన ఘటన గద్వాల జిల్లాలోని జమ్మిచేడ్‌లోఆదివారం, నది అగ్రహారంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గద్వాల మండలం జమ్మిచేడ్‌లో బీఆర్ఎస్ మద్దతుదారు రామన్‌గౌడ్ అనసూయమ్మ పేరుతో ఎక్సైజ్‌శాఖ అనుమతితో కల్లు దుకాణం నిర్వహిస్తున్నారు. కాంగ్రెస్ మద్దతుదారు బోగేందర్‌గౌడ్ ఇటీవల కల్లు దుకాణం ఏర్పాటు చేసుకొని విక్రయాలు ప్రారంభించారు. దీంతో ఇరువురి మధ్య విక్రయాల విషయంలో వివాదం చోటు చేసుకుంది. ఆదివారం రాత్రి ఇరువర్గాల వారు పరస్పర దాడులకు పాల్పడ్డారు. ఈ దాడుల్లో కల్లు సీసాలు, పెట్టెలు ధ్వంసమయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు రంగంలోకి దిగి రెండు వర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు. రెండువర్గాల వారు ఒకరిపై ఒకరు రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేయగా ఎస్ఐ ఆనంద్ కేసు నమోదు చేశారు.

■ నది అగ్రహారం సమీపంలో గద్వాలకు చెందిన కాంగ్రెస్ మద్దతుదారు కృష్ణయ్యగౌడ్ ఇటీవల గుడిసె ఏర్పాటు చేసుకొని కల్లు దుకాణం నిర్వహిస్తున్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం మధ్యాహ్నం మూడు గంటల సమయంలో గుడిసెకు నిప్పంటించారు. విషయం తెలుసుకున్న యాజమాని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం ఇవ్వడంతో సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలు ఆర్పారు. ఈ ప్రమాదంలో రూ.6 లక్షలకుపైగా ఆస్తి నష్టం జరిగిందంటూ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ముగ్గురు వ్యక్తులపై ఫిర్యాదు చేశారు.

పట్టించుకోని అధికారులు..

జిల్లాలో కొన్నేళ్లుగా బీఆర్ఎస్‌పార్టీ మద్దతుతో జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో కల్లు సొసైటీలు ఏర్పాటుచేసి పలు గ్రామాల్లో కల్లు విక్రయాలు కొనసాగుతున్నాయి. ఇటీవల రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కావడంతో ఆ పార్టీకి చెందిన గౌడ కులస్తులు ఇకనుంచి జిల్లాలో తాము కూడా కల్లు విక్రయాలు చేయాలనే లక్ష్యంతో కొత్తగా దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలను కట్టడి చేయాల్సిన ఎక్సైజ్‌శాఖ అధికారులు తమకేందుకు అన్నట్లుగా వ్య వహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ ప్రభుత్వం అధికారంలో ఉందని.. దుకాణాలు ఏర్పాటు చేసుకొని కల్లు విక్రయాలు చేపడతామని కాంగ్రెస్ మద్దతుదారులు అధికారుల వద్ద చెప్పడంతో నిలువరించే ధైర్యం చేయడం లేదని తెలుస్తోంది.

చర్యలు తీసుకుంటాం..



జిల్లాలో చోటు చేసుకుంటున్న దాడులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం . ప్రభుత్వ అనుమతితోనే కల్లు విక్రయాలు చేయాలి. అక్రమంగా విక్రయాలు చేపడుతున్న వారిని గుర్తించి చర్యలు తీసుకుంటాం. నిబంధనలు ఉల్లంఘించే వారు ఏ పార్టీ వారైనా సరే ఉపేక్షించేది లేదు.

– సైదులు, జిల్లా ఇన్‌చార్జ్ ఎక్సైజ్ అధికారి

విద్యుదాఘాతంతో విద్యార్థి మృతి

మల్దకల్: విద్యుదాఘానికి గురై ఓ విద్యార్థి మృతిచెందిన ఘటన సోమవారం మండలంలోని దాసరపల్లిలో చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బోయ మల్లేష్, కిష్టమ్మ కుమారుడు శివకుమార్ (9) గ్రామంలోని పాఠశాలలో 4వ తరగతి చదువుతున్నాడు. సంక్రాంతి సెలవులు ఉండటంతో సోమవారం గ్రామ సమీపంలోని రైతు గోవిందు వ్యవసాయ పొలంలో రేగుపండ్ల కోసం వెళ్లాడు. పొలంలో ఉన్న విద్యుత్ తీగలు గొంతుకు తగిలి విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. పండుగ రోజు కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రుల రోధనలు మిన్నంటాయి.

క్షణికావేశంలో ఉరి వేసుకుని వ్యక్తి..

నాగర్‌కర్నూల్ క్రైం: మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వలేదని, క్షణికావేశంలో ఉరి వేసుకుని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని ఎండబెట్లలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎండబెట్లకి చెందిన వెంకటయ్య(55) మద్యం తాగేందుకు తన భార్యను డబ్బులు అడిగాడు. ఆమె డబ్బులు ఇచ్చేందుకు నిరాకరించింది. క్షణికావేశానికి గురైన వెంకటయ్య ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. సంఘటనకు సంబంధించి మృతుడి భార్య గౌరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ వెల్లడించారు.

కడుపునొప్పి భరించలేక యువకుడి బలవన్మరణం

అచ్చంపేట రూరల్: కడుపు నొప్పి భరించలేక ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం అచ్చంపేటలోని సాయినగర్ కాలనీలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కాలనీకి చెందిన మహేష్(19) కొన్ని రోజులుగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. సోమవారం విపరీతంగా నొప్పి రావడంతో భరించలేక ఇంటిలో ఉన్న పురుగు మందును సేవించాడు. అపస్మారక స్థితిలో ఉన్న యువకుడిని కుటుంబసభ్యులు వెంటనే అచ్చంపేటలోని ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉందని నాగర్‌కర్నూల్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు. యువకుడి తల్లి ఈశ్వరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని అచ్చంపేట ఎస్ఐ–2 శివయ్య తెలిపారు.

వేధింపులు భరించలేక.. భర్తను హతమార్చిన భార్య

- గొడ్డలితో దాడి.. సహకరించిన కుమారుడు



మహమూద్ (ఫైల్)

బల్మూర్: మద్యం తాగి నిత్యం వేధిస్తున్న భర్తను కుమారుడితో కలిసి కట్టుకున్న భర్త హతమార్చిన ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం కొండనాగులలో సోమవారం వెలుగు చూసింది. గ్రామస్తులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన ఎండి మహమూద్ (45) తాపీమేస్త్రీగా, భార్య నిరంజన్‌బీ కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తుండేవారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉండగా కుమార్తె వివాహం జరిగింది. మహమూద్ నిత్యం మద్యం తాగొచ్చి ఇంట్లో భార్యతో గొడవ పడేవాడు. ఆదివారం అర్ధరాత్రి కూడా ఘర్షణకు దిగి భార్యపై గొడ్డలితో దాడి చేయగా.. ఆమె ఎదురుతిరిగి కుమారుడు పాషాతో కలిసి అదే గొడ్డలి తీసుకొని కొట్టగా తల, గొంతుకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. తల్లి ఖైరున్‌బీ ఫిర్యాదు మేరకు నిరంజన్‌బీ, కుమారుడు పాషాపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

నాగర్‌కర్నూల్‌లో నాలుగు ఇళ్లలో చోరీ

నాగర్‌కర్నూల్ క్రైం: గుర్తుతెలియని వ్యక్తులు నాలుగు ఇళ్లలో ఒకేసారి చోరీకి పాల్పడిన సంఘటన జిల్లాకేంద్రంలోని రాఘవేంద్రకాలనీలో సోమవారం చోటుచేసుకుంది. బాధితులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని మున్నూరుకాపు పంక్షన్‌హాల్ సమీపంలోని రాఘవేంద్రకాలనీలో నివాసం ఉంటున్న లింగమయ్య, సాయిరమేష్, చంద్రశేఖర్, శ్రీధర్ సంక్రాంతి సెలవులకు ఊళ్లకు వెళ్లారు. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో గుర్తుతెలియని వ్యక్తులు ఇంటి తాళాలు విరగొట్టి చోరీకి పాల్పడ్డారు. లింగమయ్య ఇంట్లో 15 తులాల వెండి, పావుతులం బంగారు రింగుతో పాటు హోం థియేటర్‌ను ఎత్తుకెళ్లారు. మరో ముగ్గురి ఇళ్లలో చోరీకి ప్రయత్నించి వస్తువులను చిందరవందర చేశారు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, ఎస్ఐ మహేందర్ సంఘటనా స్థలానికి చేరకుని క్లూస్ టీం ద్వారా వివరాలు సేకరించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

పొక్లెయిన్ నుంచి కింద పడి వ్యక్తి దుర్మరణం



గోవింద్‌మధు (ఫైల్)

బల్మూర్: పండుగ వేడుకలో పొక్లెయిన్ కింద పడి ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన బల్మూర్ మండలంలోని జిన్‌కుంటలో సోమవారం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శ్రీశైలం తన పొక్లెయిన్‌ను సంక్రాంతి సందర్భంగా గ్రామ సమీపంలోని ఈదమ్మ ఆలయం చుట్టూ తిప్పడానికి వెళ్లాడు. అదే సమయంలో పొక్లెయిన్ బ్లేడ్‌లో గ్రామానికి చెందిన మధు(40)ను కూర్చోబెట్టుకున్నాడు. మధు కింద పడిపోగా.. డ్రైవర్ నిర్లక్ష్యంగా వాహనాన్ని ముందుకు నడిపాడు. అతని పైనుంచి టైర్ వెళ్లి అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ సంఘటనపై మృతుని భార్య పద్మ ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి మృతుదేహానికి పోస్టు మార్టం నిర్వహించినట్లు ఎస్ఐ శేఖర్‌రెడ్డి వివరించారు. మృతుడికి భార్యతో పాటు కుమారుడు ఉన్నారు.

రామన్‌పాడులో 1,020 అడుగుల నీటి మట్టం

మదనాపురం: రామన్‌పాడు జలాశయంలో మంగళవారం 1,020 అడుగుల మేర నీటిమట్టం ఉంది. జూరాల ఎడమ కాల్వ, సమాంతర కాల్వ ద్వారా నీటిని నిలిపివేసారు. తాగునీటి అవసరాల కోసం 20 క్యూసెక్కులు నీటిని వినియోగిస్తున్నామని ఏఈ సింగిరెడ్డి రనీల్‌రెడ్డి తెలిపారు.